# కడగొట్టోళ్లు

సెలవురోజుల్లో శాఖా గ్రంథాలయానికి పోవడం రమణకు అలవాటు. తనలాగా శాఖా గ్రంథాలయానికి వచ్చే నరేష్‌తో స్నేహం కుదిరింది. స్నేహం కుదరడానికి గ్రంథాలయానికి రావడం ఒక్కటే కారణం కాదు. రమణ ఒక పట్టాన ఎవ్వరితోనూ స్నేహం చేయడు.

నరేష్‌ది రమణ వయసే. అతని తల్లిదండ్రులది కులాంతర వివాహం. నరేష్ తండ్రి కమ్యూనిస్టు ఉద్యమకారుడు. వాళ్ల ఇంట్లో పెద్ద గ్రంథాలయం ఉంది.

అలాంటి కుటుంబంనుంచి వచ్చిన నరేష్ అంటే రమణకు ఒక విధమయిన భక్తిభావం, గౌరవం, అంతకు మించి ఇష్టం. దీనికి తోడు నరేష్ పుస్తకాల పురుగు.

ఇద్దరి మధ్య స్నేహం బాగా పాదుకునింది. తరచూ ఆదివారాల్లో, ఇతర సెలవురోజుల్లో గ్రంథాలయంలో కలిసేవాళ్లు. అప్పుడప్పుడు ఒకరింటికి ఒకరు పోయేవాళ్లు. గ్రంథాలయం దగ్గర హోటల్లో కూర్చుని టీ తాగేవాళ్లు. రచయితల గురించి, వారి రచనల గురించి గంటలు గంటలు మాట్లాడుకునే వాళ్లు. యువతలో పుస్తక పఠనం పట్ల తగ్గుతున్న ఆసక్తిని చూసి బాధపడేవాళ్లు. మూడేళ్లు గడిచినాయి.

ఒకరోజు దగ్గరి పట్టణంలో ప్రముఖ రచయితది పుస్తకావిష్కరణ ఉన్నింది. రమణ, నరేష్ ఆఫీసులకు సెలవుపెట్టి సభకు బస్సులో పోతావుండారు. మధ్యలో ఒకచోట దాదాపు ఇరవై మందిదాకా బస్కు ఎక్కినారు. కుచ్చోను సీట్లు లేకపోవడంతో వీళ్ల పక్కన చాలామంది నిలబడుకునే వుండారు. ఎముకలు తేలిన దేహాలు, లోతుకుపోయిన కళ్లు, మాసిన బట్టలతో ఉండారు. వాళ్ల మాటలను బట్టి చావుకు పోతాన్నెట్టు తెలిసింది. వాళ్లలో ఎక్కువమంది ఆడవాళ్లు ఉండారు. వీళ్ల పక్కన నిబడుకోనుండే ఆడవాళ్లు ఇద్దరు వక్కాకు తీసి నమలడం మొదలు పెట్టినారు. కొందరు గలగలా మాట్లాడతా ఉండారు. వాళ్లలో బక్కపలచగా ఉండే ఒకామె తన అమ్మలాగా అనిపించింది రమణకు. ఆమెనే తదేకంగా చాలాసేపు చూశాడు. బస్సు దిగేదాకా అమ్మ, నాయన, వూరు, కరువు... మనసులో మెదలతానే ఉండాయి.

నరేష్ ముఖంలో రకరకాల భావాలు. ఆ మనుషులను భరించలేనట్టుగా చూశాడు. కర్చీఫ్‌తో ముక్కు మూసుకున్నాడు. దీన్నంతా రమణ గమనించాడు. బస్సు దిగి సభ జరిగే చోటుకు నడుచుకుంటా పోతాఉండారు.

ఈ వేళకు నేను ఇంటి కాడ ఉన్నింటేనా... నేరుగా బాత్‌రూంలో దూరి స్నాం చేసిందును.... అన్నాడు నరేష్ ముఖం వికారంగా పెట్టి.

రమణ ఆశ్చర్యపోయినాడు.

నీ విషయం నేను మొదటే గమనించినా.. మనం హోటల్‌కు టీకి పోయినప్పుడు నువ్వు నా చేతికి డబ్బు ఇచ్చేవాడివి. ఆ ఇచ్చే విధానం ఏదో తాకకూడని దాన్ని తాకాల్సి వస్తాందే అన్నట్టు ఉండేది నీ ముఖం. నేను చాలా ఇబ్బందిగా ఫీలయ్యేవాడిని.. అన్నాడు రమణ.

నరేష్ నవ్వి... ఎవరైనా నా పద్ధతి అంతే అన్నాడు.

రమణ ఆ సమాధాన్ని జీర్ణించుకోలేక పోయినాడు.

కమ్యూనిస్టుల కుటుంబంలో పుట్టి పెరిగి, ఉన్నత చదువులు చదివి, మంచి సాహిత్యాభిమాని అయి ఉండీ... ఇంకా ఇలా ఆలోచిస్తున్నాడేంది అనుకున్నాడు.

మీ ఆయనంటే నా కెంతో అఫెక్షన్, నాకున్న అందరు ఫ్రెండ్స్‌లోకి మీ ఆయనే నాకు దగ్గర... అని తన భార్యతో నరేష్ రెండు మూడు సార్లు చెప్పడం రమణకు గుర్తొచ్చింది. తమ మధ్య సాన్నిహిత్యం ఉందనిపించే ఇంకా ఏవేవో సంఘటనలు కళ్లముందు కదలాడాయి. కులం ముందు, ధనం ముందు సాన్నిహిత్యం, స్నేహం పనికిరావనే సంగతి ఆ సంఘటనతో నిజమని తేలింది.

ఆ ఒక్క సంఘటన తనను గత జీవితంలోకి తొంగి చూసుకునేలా చేసింది. అలాంటి సంఘటనలను మరెన్నింటినో తిరగదోడి ఇరవై ఐదు సంవత్సరాల గతాన్ని కళ్ల ముందుంచింది.

పేర్ల చివరన రెడ్డి, నాయుడు, శాస్త్రి, బాషా, ఆచారి లాంటి సర్వనామాలు ఎందుకుండాయో తెలీని వయసది. మనుషులంతా ఒక్కటి కాదని... కులాలుగాను, మతాలుగాను విడిపోయారని, వాటిల్లో కూడా ఒక్కో కులానికి, ఒక్కో మతానికి ఒక్కో రకం గుర్తింపు ఉంటుదని తెలీని వయసది.

రాజారెడ్డి మామోళ్ల ఇంటికి పోయి మజ్జిగ పోయించుకోని రాపో అని అమ్మ చెప్పితే గ్లాసు తీసుకోని పరిగెత్తతా వాళ్ల యింటికి పోయేవాడు. అత్తా అత్తా... మా అమ్మ చెప్పింది మజ్జిగంట పొయ్యి అనేవాడు రమణ.

ఈ కంసల నాబట్టకు ఎప్పుడు తొందరే. ఉండరా కొంచేపు అనేదాయమ్మ. ఇంట్లో వంటపనులు చేసుకుంటా ఉండిపోయేది. రమణ ఆ ఇంటి గుమ్మం వద్ద తలుపుకు ఆనుకుని నిల్చుని ఆ ఇల్లాలు అటూ ఇటూ తిరుగుతాఉంటే చూస్తా ఉండేవాడు. నిల్చుని రమణకు కాళ్లనొప్పులు వచ్చేటియి.

నాయనా రమణా... అని వాడి అమ్మ అరుపు వినిపించేదాకా నిలబెట్టి మజ్జిగ పోసేదామె.

అమా... అమా... కంసల నాబట్ట అంటే ఏందిమా అనేవాడు ఇంటికి మజ్జిగతో వచ్చిన రమణ.

ఎవరన్నేరు నిన్ను... ఆ రాజారెడ్డి భార్య ఆనిందా... అత్త కదా... ఆట్లంటుందిలే... అనేది అమ్మ. ఆ మాటలంటున్నప్పుడు ఆమె ముఖంలో ఏదో తెలీని దిగులు కనిపించేది రమణకు. అంతకు మించి ఆలోచించే, ప్రశ్నించే బుర్ర వాడికి అప్పుడు ఉండేది కాదు.

సుబ్బారెడ్డి పెద్నాయనోళ్ల ఇంటికి పోయి, పెద్దమ్మనడిగి ఊరిమిండిలోకి కొన్ని ఎర్రగడ్డలు తీసుకోని రాపో... అని అమ్మ చెప్తానే రమణ దిగవీధిలోకి ఒగటే మోపున పరిగెత్తతా పోయేవాడు.

పెద్దమ్మా... పెద్దమ్మా... మా అమ్మ చెప్పింది... ఊరిమిండిలోకి కొన్ని ఎర్రగడ్డలంట ఈ అనేవాడు.

యాడ మీ అబ్బ గంటంతా ఈడుండాది. అంతగా పరిగెత్తతా రాకుంటే చిన్నగా వచ్చిండేది ఆందాయమ్మ గంజి వంచతా.

తన ఈడు, తనకన్నా పెద్ద అయిన ఆమె ఇద్దరు కొడుకులు మంచంమీద కుచ్చోని నోడ్సులో రాసుకుంటా ఉండారు. వాళ్ల దగ్గరికి పోయి మంచంకోడుకు ఆనుకుని నిల్చుకున్నాడు రమణ. వాళ్లతో పాటు మంచంమీద కుచ్చొందామని ఉన్నా పెద్దమ్మ తిడుతుందని కుచ్చోలేదు.

అలా ఎంతసేపున్నాడో..., వాళ్ల పిల్లలిద్దరూ తినేదానికి లేవడంతో రమణకు కూడా ఆకలి వేసింది. తను వచ్చిన సంగతి గుర్తొచ్చింది. మళ్లీ ఒకసారి ఎర్రగడ్డల సంగతి గుర్తుచేశాడు పెద్దమ్మకు.

సారం లేని పేయలు కొన్ని తీసి వాడిచొక్కాయి జేబులో వేసిందామె. వాటిని తీసుకుని ఇంటికి పరిగెత్తతా పోయి అమ్మకు ఇచ్చి... అమా... అమా... అబ్బగంటంటే ఏందిమా? అడిగినాడు రమణ.

పెద్దమ్మ అనిందా... మీ నాయన మరిది కదా. అందుకే అట్లనింటాదిలే అందామె. ఆ మాటలంటున్నప్పుడు ఆమె ముఖంలో విచారం మబ్బులు.

నిన్ను రాజవ్వ ఏమో రమ్మని చెప్పింది. పోయిరాపో అంది అమ్మ.

ఎందుకంటమా... అడిగినాడు రమణ.

ఏమో నాయనా... నాకేం తెలుసు... మనవడికోసం ఏం దాచిపెట్టిండాదో అంటా రాజవ్వ ఎందుకు రమ్మనిందో చెప్పకనే చెప్పింది అమ్మ. ఆమె మాటల మర్మం అర్థమయింది. వెంటనే వాళ్ల యింటికి పరుగుమింద పోయినాడు.

అవ్వా... అవ్వా... నన్ను రమ్మన్నేవంటనే అన్నాడు రాజవ్వతో గసపోస్తా.

కంసలోల్లది కడగొట్టు జాతని పెద్దోళ్లు ఊరికే అనలా. నేను మీ అమ్మకు చెప్పి ఏయరవ అయింది? ఇప్పుడా వచ్చేది...? మీ మామోళ్లు యాడికో పోయిండారు. గొడ్లు అరస్తా ఉండాయి. తలుపుమూల దున్నికట్టి ఉండాది. ఎత్తుకోని కొట్టు కొంచేపు... అనింది

రాజవ్వ చెక్కుడు గడ్డిని కట్టితో కొడతా. రమణ కూడా తలుపు సందున ఉండే దున్నుకట్టిని తీసుకోని రాజవ్వకు ఎదురుగా గొంతుకుచ్చోని కొట్టడం మొదులు పెట్టినాడు. కట్టితో కొట్టిన గడ్డిని మన్నంతా రాలిపోయేటిగా ఇదిలించి ఇద్దరూ తీసుకొనిపోయి కొట్టంలో ఉండే గొడ్లకు వేసినారు.

నన్నేంవా రమ్మన్నేవంట అంటా మళ్లా గుర్తుచేసినాడు రమణ.

నిన్నా... ఉండు... అంటా ముందురోజు చేసి ఇంట్లో అందరూ తినగా మిగిలిపోయిన రెండు సుగుంటలు తెచ్చి వాడి చేతికి ఇచ్చింది.

వాటిని తింటా ఇంటికి వచ్చి అమా... అమా... కంసలోల్లది కడగొట్టు జాతంటే ఏందిమా... అనడిగినాడు అమ్మను రమణ.

రాజవ్వ అనిందా... పెద్దాయమ్మకు సాటవలు చానా వచ్చులే. అట్లే మాట్లాడతా ఉంటాది అనేది అమ్మ.

ఆ మాటలంటున్నప్పుడు ఏదో తెలీని కోపం ఆమె ముఖంలో నీడలా కదలాడేది. తిరిగి రమణ ఆటల్లో మునిగిపోయేవాడు. లేకపోతే అమ్మ పైటచెంగుపట్టుకోని సుట్టకారం తిరుగులాడతా ఉండేవాడు. పొద్దుపోయి దీగూట్లో దీపం మలగతానే అన్నం తినేసి నడీదిలోకి పొయ్యేవాడు ఆడుకునేదానికి, లేకపోతే అమ్మ చెప్పే కతలు ఇంటా కలల్లో తేలిపోయేవాడు.

అప్పుడప్పుడే కులమంటే ఏమి? ధనమంటే ఏమి? అనే విషయాల కొద్దికొద్దిగా తెలస్తా ఉండాయి రమణకు.

ఆ పొద్దు ఆదివారం. అమ్మానాయన పక్కవూరికి పనికి పోతా ఉంటే తోకమాదిరిగా పోయినాడు రమణ. అమ్మానాయన కొయ్యపని చేస్తా ఉంటే సందేళదాకా పిల్లోళ్లతో ఎగురులాడతా ఉన్నేడు. ఆట్నించి ఇంటికి ఎలబారేలకు పొద్దు గుంకింది. వూరి ముందర ఏటూరోళ్ల చేన్లో ఆంతదూరంనించే ఒగ పిల్లగాడు ఈళ్లకళ్లా పరిగెత్తతా వస్తాండాడు. వాన్ని చూస్తానే గుర్తుపట్టి రోయ్... వాసూ... అంటా రమణ కూడా ముందుకు పరిగెత్తినాడు. ఇద్దరూ ఒకరి చేతిని ఒకరు లిబ్బిని పట్టుకున్నెట్టు పట్టుకోని బాగుండావారా... బాగుండావారా అంటా పలకరించుకున్నేరు. ఇంటికళ్లా నడుచుకుంటా వస్తాండారు.

నేను పద్దన్నే బస్సుకు వచ్చినా. నువ్వు ఆ పల్లెకు పోయినావని మా చిన్నమ్మ చెప్పింది. నీకోసరం ఈన్నే కాసుకోనుండా అని చెప్పినాడు వాసు.

నువ్వొచ్చినావని నాకుతెలీదు. లేకుంటే నేను అప్పుడే వచ్చేసింద అన్నాడు రమణ. పరిగెత్తదామని ఒగరితో ఒగరు చెప్పుకోనేలేదు. ఒకేసారి ఇద్దరూ పకపకా నవ్వుకుంటా పరిగెత్తడం మొదలు పెట్టినారు.

రేయ్... పడతారు... చిన్నగా పొండి... అరిచినారు ఆచారి, అతని భార్య.

వాళ్ల అరుపులను పట్టించుకోలేదు రమణ, వాసు. పరుగాపలేదు. ఇద్దరూ కలిసి

పూర్లో ఉండే తమతీడు పిల్లలను కొందరిని పిల్చుకోని గుండంకాడికి వచ్చినారు. కొంచేపు కుంటేట ఆడినారు. దాంకులోబూచి ఆడినారు. గుండ్రోతంగా కుచ్చోని గుండొత్తి ఆడతా ఉండారు. రమణ, వాసు ఒకరి పక్కన ఒకరు కుచ్చోని వుండారు.

రేయ్... వాసూ... రా ఇట్ల... అంటా వాసు అమ్మ వచ్చింది.

నేనాడుకోవాల పోమ్మా... అంటా రమణ చేతిని గట్టిగా పట్టుకున్నేడు వాసు.

రారా... అంటా కోపంగా వాడి చేతిని పట్టుకోని లాక్కోని పోయిందాయమ్మ. వాసు ఎనకంటీ పోబోయిన రమణను నువ్వేడికిరా... పో ఇంటికి అంటా అరిచింది.

రమణ కొంచేపు వాసునే చూసి నేరుగా యింటికి వచ్చేసినాడు.

ఏం నాయనా... అప్పుడే వచ్చేసినావే... ఆడుకోలేదా? అడిగింది పొయ్యిదగ్గర సద్దరొట్టెలు కాలస్తా ఉండే అమ్మ.

లేదమా... వాసును వాళ్లమ్మ వచ్చి పిల్చకపోయింది. దిగులుగా చెప్పినాడు రమణ. వాళ్లమ్మ పిల్చుకోని పోయిందా... అంటా కొడుకు ముఖంలోకి చూసి తిరిగి తన పనిలో మునిగి పోయింది అమ్మ.

వాసు సిద్దారెడ్డి కొడుకు... సిద్దారెడ్డిది ఆచారి ఇంటికి వెనకిల్లు. సిద్దారెడ్డి, ఆచారి బాల్యమిత్రులు. అంతో ఇంతో కలవారి కుటుంబానికి చెందిన సిద్దారెడ్డి కాలక్రమంలో కొద్దిగా చదువుకుని పశువుల ఆస్పత్రి కాంపౌండర్ అయినాడు. రెండో తరగతిలోనే చదువు ఆపేసి కొయ్యపనిలోకి దిగినాడు ఆచారి. అయితే ఆచారి మాత్రం తమ చిన్ననాటి సంగతులను తీపి జ్ఞాపకాలుగా అప్పుడప్పుడు కొడుక్కు చెప్తా ఉంటాడు. తమలాగే రమణ, వాసు కూడా స్నేహంగా ఉండాలని అంటా ఉంటాడు. వాసు సెలవుల్లో ఆ వూరికి వచ్చినాడంటే ఎక్కువ సేపు రమణతోనే ఉండేవాడు. అప్పట్లో బాలమిత్రులకథ సినిమా పక్కవూరి టెంట్లో వేసినారు. ఆ సినిమా చూసి వచ్చిన వాళ్లంతా వాసు, రమణలకు సత్యం, ధర్మం అని పేర్లు పెట్టినారు.

ఎప్పటిలాగే ఆ పొద్దు మామూలుగానే తెల్లవారుజామున కోడిపుంజులు కూతలేసినాయి. తూరుగా ఎర్రపటమెగిరేలకు కాకులు చింతచెట్లలోనించి కావ్.. కావ్.. అంటా అరిచినాయి. పొద్దు పదిబారలు ఎక్కితేగానీ నిద్రలెయ్యడు రమణ. ఆపొద్దు అంతకన్నా ముందుగానే వచ్చి నిద్రలేపేసినాడు వాసు. ఇద్దరూ పల్లెముందర గుట్టలోకి పోయినారు. వస్తా వస్తా దోవలో ఏపచెట్టు ఎక్కినారు. చెరొక ఏపపుల్ల ఇంచుకోని పండ్లు తోముకుంటా ఇంటికి వచ్చినారు.

ఎంతసేపురా... దొడ్డికి పోయ్యేది. బిన్నే మొగం కడుక్కోండి తిందురు. పనికి పోవాల అనింది అమ్మ. ఇద్దరూ జలజారి గుంతకాడ కాళ్లు, చేతులు, ముఖం కడుక్కున్నేరు.

రెండు గిన్నెల్లో ఉడుకుడుకు సంగటి పెట్టి, బెండకాయల పుల్లగూర వేసింది అమ్మ.

వద్దురా... మా అమ్మ తినద్దనింది... నా కొద్దత్తా... అన్నాడు వాసు.

మీ అమ్మ వద్దనిందా?

జెనత్తా... మీ ఇంట్లో ఏమేగానీ తినద్దనింది. రమణతో ఆడుకునేదానికి పోవద్దనింది. నేను ఈనితో ఆడుకుంటే చెడిపోతానంట.. నాకు చదువు రాకుండా పోతాదంట.. అమ్మ చెప్పిన మాటలన్నీ అమాయకంగా చెప్పేసినాడు వాసు.

ఏంవాయ్... మా ఇంట్లో తింటే... నాతో ఆడుకుంటే ఏం...? నిలదీసినాడు అంతకన్నా అమాయకంగా రమణ.

వాసు మిత్రునికల్లా దిగులుగా చూసి, పొగలు కక్కతా ఉండే గిన్నెలోని సంగటి మీదకు చూపు తిప్పినాడు. చిరుగుల బట్టలతో నల్లగా ఉండే కొడుకును, ఖరీదయిన బట్టల్లో తెల్లగా ఉండే వాసును కొంతసేపు చూసి దీర్ఘంగా నిట్టూర్చింది అమ్మ.

మీ అమ్మకు చెప్పొద్దులే తిను... అంది అమ్మ.

వాసు గిన్నె తీసుకొని ఉఫ్.. ఉఫ్... అంటా సంగటిని ఊదుకోని గబగబా తింటా ఉండాడు. తింటానే తలుపుసందులోనించి వీధిలోకి చూస్తాఉండాడు అమ్మ వస్తుందేమో అని.

వాసూ... వాసూ... అంటా ఇంటి వెనకనింటి సిద్దారెడ్డి భార్య పిలస్తానే సంగటి వదిలేసి గబగబా చేయి కడుక్కోని ఇంటికి పరిగెత్తతా పోయినాడు వాసు.

అమా... నాతో వాన్ని ఎందుకు ఆడుకోవద్దనిందిమా అత్త...? అడిగినాడు రమణ అమ్మను.

తినరా గమ్మున... మీ నాయన మొబ్బుతోనే ఎల్లిపాయ. సంగటి ఎత్తుకోని పోవాల... అంటా మాట దాటేసేదానికి చూసింది అమ్మ. కానీ రమణ ఏపబంక మాదిరిగా తగులుకున్నేడు. చెప్పుమా.. నాతో ఎందుకు ఆడుకోవద్దనింది అత్త... అడిగినాడు మళ్లా.

ఇక తప్పదనుకునిందేమో... వాళ్లు రెడ్లు... మనం ఆచార్లం... వాళ్లు ఉండేవోళ్లు... మనం లేనోళ్లం... అంది దిగులుగా అమ్మ.

అయితే...? ప్రశ్నించినాడు అమ్మను. అమ్మ చెప్పిన వాటిమధ్య అంతరం వాడికి అర్థం కాలేదేమో.

నీకెందుకురా అయ్యన్నీ... అడ్డగాడిదా... తినూ గమ్మున... అరిచింది అమ్మ.

అమ్మ ఎందుకు కోపగించుకునింది.., అత్త ఎందుకు అట్ల చెప్పింది? ఆలోచించడం మొదలు పెట్టినాడు రమణ. రోజులు గడిచే కొద్దీ వాడిలో ఆలోచనలూ ఎక్కువయినాయి.

కులానికీ, ధనానికీ మనషులెంత ప్రాధాన్యం ఇస్తా ఉండారో గమనించడం మొదలు పెట్టినాడు.

రమణకు బాగాగుర్తు... తను చానా చిన్నగా ఉన్నప్పుడు పక్కింటి నాగిరెడ్డి మామోళ్లది పూరిల్లు మాత్రమే. తనకు నాలుగేళ్ల వయసప్పుడు నాగిరెడ్డి మామోళ్లు ఇరవై అంకణాల మిద్దె ఎత్తినారు. మిద్దెకు బండలు ఎత్తినప్పుడు పొగ్గాడుకాడ బండ జారి కింద పడిపోయిందేది రమణకు ఇంకా లీలగా గుర్తుంది. ఆవూర్లో రెండో పెద్ద ఇల్లది. ఆ ఇంటికి అవసరమయిన

తలుపులు, దాలమంద్రాలు, కిటికీలు.., అన్నీ ఆచారి, అతని మేనమామ చేసినారు. అప్పటికి రమణ బడికి పోయేవాడు కాదు. ఆ వూర్లో చదువుకునే పెద్ద పిల్లోళ్లకే చింత చెట్లకింద చెప్తా ఉంటే, ఇంత చిన్నపిల్లోళ్లను బడికి ఎవరు పంపుతారు?

రమణకు పుట్టిన వెంట్రుకలు తీసారంతే. రెండోసారి తిరుమల కొండకుపోయి వెంకటేశ్వరునికి వెంట్రుకలు ఇవ్వడం వాళ్ల ఆచారం. రెండోసారి వెంట్రుకలు ఇంకా ఈలా. ఏదో సమచ్చరంలో పోయి ఇచ్చి రావళ్లనుకుంటా ఉండారు ఆచారి దంపతులు.

రోజు రమణకు అమ్మ తలదువ్వి నెత్తిన పిలక వేసేది. లేకపోతే రెండు జడలు వేసేది. రెండు జడల నిండుకు పెరట్లో ఉండే కనకాంబరం పువ్వులను అల్లి పెట్టేది. రమణ అయితే అంతకన్నా ఎర్రగా ఉంటాయని సూర్యకాంతం పూలు కావాలని ఏడ్చేవాడు.

ఆచారి వాళ్లు నాగిరెడ్డి ఇంటిపని చేసే అన్ని రోజులూ రమణ అక్కడే ఆడుకుంటా ఉండేవాడు. తల దువ్వుకుని, పూలు పెట్టుకుని నష్టన తిలకంతో నామం పెట్టుకుని ఉండే కొడుకును చూస్తే ఆచారికి ఎంత సంతోషమో. పని దగ్గర ఎన్నిసార్లు దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకునేవాడో.

పనికి అడ్డం రావద్దు. దూరంగా పోవాయ్ చీమిడి ముక్కు నాయాలా.. అనేవాడు నాగిరెడ్డి.

నేను మానాయన కాడే ఉంటా అంటా ఆచారి ఒడిలో కుచ్చొనేవాడు రమణ.

ఇంటిపని పూర్తయింది. ఇంటి పనితోపాటు రెండు బెంచీలు చేశారు. పక్క ఇల్లే కావడంతో రమణ ఎక్కువగా వాళ్ల ఇంటికి దగ్గరే ఉండేవాడు. ఆ ఇంటిలో తన ఈడు. పిల్లలు ముగ్గురు ఉండేవాళ్లు. వాళ్లతో కలిసి ఆడుకునేవాడు. నిద్రొస్తే అక్కడే బెంచీమీద పడుకునేవాడు.

ఆ ఇంటిని తన స్వంత ఇంటిమాదిరిగానే అనుకునేవాడు. ఆ మనుషులంతా తన ఇంట్లో వాళ్లమాదిరిగానే అనుకునేవాడు. నాగిరెడ్డిని మామా అని పిలిచేవాడు. అతని భార్యను అత్తా అని అనేవాడు.

పల్లెల్లో తను అత్తా అని పిలిచేవాళ్లంతా తన అత్తలు కాదని, తను మామా అని పిలిచే వాళ్లంతా తన మామలు కాదని వయసు పెరిగేకొద్దీ రమణకు తెలుస్తా వచ్చింది.

నాగిరెడ్డి ఇంట్లో బెంచీమీద పడుకునేవాడు. ఎక్కువగా అక్కడే కుచ్చొనేవాడు. అలాంటివి తమ ఇంటిలో లేనందుకేమో, వాడికి అవి బాగా నచ్చినాయి.

కొన్నాళ్లకు ఆ బెంచీల మీదకు పరుపులు, దిండ్లు చేరినాయి, మనిషి కుచ్చొనేంత జాగా కూడా ఉండేది కాదు. తొలిరోజుల్లో వాటిని అక్కడినుంచి తీయమని మారం చేసేవాడు రమణ.

ఇంగెక్కడ పెట్టేది వాయ్... నీ నెత్తిన పెట్టేదా..? అనేవాడు నాగిరెడ్డి.

సరేలే అనుకుని స్టూలు మీద కూచ్చొనేవాడు రమణ. కొన్నాళ్లకు స్టూలు దేవుని రూములోకి వెళ్లిపోయింది. ఆ ఇంట్లో నాలుగు ఇనపకుర్చీలుండేడియి. వాటిని తెచ్చినప్పుడు ఆ కుర్చీమీద కొంచేపు ఈ కుర్చీమీద కొంచేపు కుచ్చోని ఎంత సంతోషపన్నేడో..

రేయ్... దిగరా.. పెద్దోళ్లు కుచ్చోనేది కదా... పిల్లోల్లు కింద కుచ్చోవాల అని గదురుకున్నేడు నాగిరెడ్డి. రమణ తెల్లమొగం వేసుకుని కిందికి దిగినాడు. తన ఈడే ఉండే నాగిరెడ్డి కూతురు మాత్రం కుర్చీ దిగలా. నవ్వతా వాడినే చూస్తా ఉంది. రమణ పోయి ఆ కుర్చీని పట్టుకుని నిలబడుకున్నాడు.

ఆ అమ్మాయిది కూడా తన వయసే కదా. మరి తను మాత్రం కుర్చీలో కుచ్చొనింది, నన్నెందుకు కుచ్చోనీలేదు...? అని తనలో తనే ఆలోచించడం మొదలు పెట్టినాడు. ఈ మధ్య వాడు ఇలాంటి విషయాలు అమ్మకు గానీ, నాయనకు గానీ చెప్పడం లేదు. ఆలోచిస్తా ఉంటే వాడికే అర్థమవుతా ఉంది.

ఆ పల్లెలో మొత్తం డెబ్బై ఇళ్లుంటాయి. అందులో ఇరవై ఇళ్లు సాయిబులియి. ఆరిండ్లు ఆచార్లయి. ఎనిమిదిండ్లు చాకలోళ్లయి. ఒక్క ఇల్లు మాదిగోళ్లది, మిగిలిన ఇళ్లన్నీ రెడ్లయి. పల్లెకు చుట్టూ అనుకుని ఉండే పొలాలన్నీ రెడ్లయే. చాలామంది ఇండ్లు కూడా రెడ్ల తాతల కాలంలో దయతలచి ఇచ్చిన జాగాలోనే కట్టుకోనుండారు. మాదిగోళ్ల ఇల్లు మాత్రం పల్లెకు నూరు గజాల దూరంలో ఉండేది. చాకలోళ్ల ఇండ్లు పల్లెకు కడాన ఉండేటియి.

ఆచార్ల ఇండ్లు రెడ్ల ఇండ్లకు ఇంకో కడాన ఉండేటియి. వాళ్ల ఇళ్లను అనుకుని సాయబులు ఇండ్లు ఉండేటియి.

పొలాల దగ్గరా, పనుల దగ్గరా, మంచినీళ్ల బోరింగు దగ్గరా... రెడ్లకు ఎవ్వరూ ఎదురు చెప్పకూడని స్థితిని రమణ గమనించడం మొదలు పెట్టినాడు. ఆ స్థితిని భరించలేక ఎవ్వరన్నా సాయబుల ఒకరిద్దరు ఎప్పుడన్నా రెడ్లను ప్రశ్నించిన సందర్భాలూ ఉన్నాయి. అయితే వాళ్లు ప్రశ్నించిన వెంటనే రెడ్లు సాయిబుల ఇండ్ల చుట్టూ కంపలు వేసేసే వాళ్లు. మాజాగాలో నడద్దండి అని హుకుం జారీ చేసేవాళ్లు. కాదు కూడదని ఎవరైనా కంపలను తీసేసి దోవలో నడిస్తే వాడి వొళ్లు హూనమవుతాది.

తమ తాతల కాలంనుంచీ ఆ పల్లెలో అలాగే వుందనే విషయం పెద్దవాళ్ల మాటలను బట్టి రమణకు అర్థమయింది. అలానే ఎందుకున్నారు...? అనేదే రమణకు అర్థంకాని విషయం. ఈ విషయాన్ని ఎప్పుడన్నా పెద్దవాళ్ల దగ్గర ప్రస్తావిస్తే... పుట్టగోచిగాళ్లం... మనకెందుకులే రెడ్లతో గొడవలు అని మాటలు దాటేసేవాళ్లు.

మనుషుల మధ్య, కులాల మధ్య, మతాల మధ్య అంతరాలు అర్థమయ్యే కొద్దీ ఆ పూర్లో రెడ్ల ఇండ్లకు, ఆ మనుషులకు రమణ దూరం జరిగిపోవడం మొదలయింది.

దూరం జరగడం ఎప్పటినుంచి మొదలయిందో కూడా రమణకు బాగా గుర్తే. రమణ

చిన్నప్పటి నుంచి వసపిట్ట. ఎప్పుడూ గలగలా మాట్లాడతా వుండేవాడు. పెద్దయ్యేకొద్దీ ఆ అలవాటు పెరిగిందే కానీ తగ్గలేదు. అందరితో కలుపుగోలుగా మాట్లాడటం, ఏమైనా సమస్యలుంటే తర్కించి కారణాలను విశ్లేషించడం తనకు తెలీకుండానే జరిగిపోతా వుండేది.

అప్పుడు రమణ ఇంటర్‌మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీగా ఉన్నప్పుడంతా కష్టపడుతుండటంతో బలిష్టంగా ఉన్నాడు. సంక్రాంతి పండుగరోజులు. రాత్రి ఎనిమిది గంటలు అవుతా ఉంది. ఊరంతా చీకటిగా ఉంది. చలిగా ఉండటంతో సాయుబుల వీధి చివరలో కొందరు ముసలి వాళ్లు, ఆడవాళ్లు చలిమంట వేసి కుచ్చోనుండారు. నాగిరెడ్డి ఇంటికి ఎదురుగా ఉండే రాముల గుడి అరుగుమీద కుచ్చోనుండాడు రమణ. రమణ పక్కన నాగిరెడ్డి చిన్నతమ్ముడు సురేష్‌రెడ్డి కుచ్చోనుండాడు. అతను రమణకన్నా ఏడేళ్లు పెద్ద. అతనికింకా పెళ్లి కాలేదు. వాళ్లకు ఎదురుగా ఇద్దరు సాయుబుల పిల్లోళ్లు నిలబడుకోనుండారు.

మాటల మధ్యలో జనవరి ఫస్టుకు గ్రీటింగులు కొనలేదా అనడిగినాడు రమణను సురేష్‌రెడ్డి. లేదుమామా.. జనవరికి మనమెందుకు కొనాల? మనం ఉగాదికి గ్రీటింగ్‌లు పంపాల కానీ జనవరికి కాదు అని చెప్పినాడు రమణ.

ఆ... బళే చెప్పినావులే బోడి.. నువ్వు అనుకున్నెంత మాత్రాన అందురూ గ్రీటింగ్‌లు కొనేది ఆపేస్తారా...? నేనూ కొన్నే గ్రీటింగ్‌లు... కోపంగా అన్నాడు సురేష్‌రెడ్డి.

ఆ మాటలతో రమణకు కోపం వచ్చింది.

బోడి... నువ్వు కొన్నెంత మాత్రాన అందురూ కొనాలా గ్రీటింగ్‌లు...? అడిగినాడు.

ఏయ్... నన్నే బోడి అంటావా.. అంటా పైకి లేచినాడు సురేష్‌రెడ్డి కొట్టేవాని మాదిరిగా.

రమణ కూడా గొడవ అవుతుందనుకున్నాడు. తను కూడా కొట్లాటకు సిద్ధమయినట్టు లేచి నిలబడుకోని లుంగీని పైకి మడిచి కట్టుకుంటా.. ఏం.. నువ్వనచ్చా బోడి అని... నేనంటే తప్పా...? అన్నాడు. ఏయ్... ఏందిరా నువ్వు... పెద్దా చిన్నా గౌరవం లేకుండా... మా వోన్ని బోడి అంటావా... నువ్వెంత... నీకులమెంత.. అంటా వచ్చినాడు నాగిరెడ్డి.

ఇంటి ముందు కుచ్చోని వాళ్ల మాటలన్నీ వింటా వుండిన ఆచారి పరుగున అక్కడికి వచ్చినాడు.

ఏదో చిన్నోడు పోనీలేప్పా.. నువ్వు రారా ఇంటికి.. అన్నాడు కొడుకుతో.

నేనేం ముందుగా అనలేదు. నన్నంటేనే నేనన్నేను.. అన్నాడు రమణ. అప్పటికే వాడి వొళ్లు కోపంతో అదురుతా ఉండాది.

కొట్టేదానికి మీదికి ఎగబడతా ఉండే అన్నాతమ్ముళ్ని సుధాకర్‌రెడ్డి చేతులతో పట్టుకోని ఆపినాడు. మీరు పొండినా ఇంట్లోకి... కాదురా రమణ... నోటికి ఎంత మాటొస్తే అంత మాట అనేసేదేనా...? అన్నాడు.

పోనీలేప్పా... పిల్లోడు... తెలీక అన్నేడు... అంటా కొడుకును ఇంటికి లాక్కోని పోయినాడు ఆచారి.

పెద్దవాళ్లతో మనకెందుకు.. వాళ్లేదన్నా ఒగమాట అన్నే, ఒగదెబ్బేసినా... చూసీ చూడనట్లు పోవాల... మన ఆచార్ల ఇండ్లు ఉండేదే ఆరు... రెడ్లయి నలభై ఇండ్లదాకా ఉండాయి. వాళ్లంతా వస్తే మనమేం చేస్తాం. తెల్లారి లేసిన కాన్నించి రెడ్ల ఇండ్ల చుట్టూ తిరగతా బతకతా వుండాము. వోళ్లతో కొట్లాటకు పోతారా ఎవురైనా...? అంటా ఆ రాత్రంతా కొడుక్కు బుద్ది మాటలు చెప్తానే ఉన్నాడు ఆచారి.

రమణ మాత్రం నాయన మాటలకు ఊకొడతా ఉండాడు కానీ మనసంతా ఏవేవో ఆలోచిస్తా ఉండాది. నాగిరెడ్డి అంగన్ వాడీ టీచరు. అతనికి మీటింగ్‌లప్పుడు రమణ డ్రాయింగ్ వేసిచ్చేవాడు. చార్ట్‌లు రాసిచ్చేవాడు. వాళ్ల పిల్లలకు బడిలో వక్తృత్వ పోటీలకు, వ్యాసరచన పోటీలకు రాసిచ్చేవాడు. తనను చాలా సార్లు అవసరానికి ఉపయోగించుకుని, తన తప్పు లేకపోయినా నాగిరెడ్డి అతని తమ్మునికే సపోర్ట్‌గా మాట్లాడాడే అని బాధపడ్డాడు.

అది మొదలు... నాగిరెడ్డి ఇంటికే కాదు, పల్లెలో రెడ్ల ఇండ్లకే పోవడం మానుకున్నాడు. ఒక వేళ తప్పనిసరి పరిస్థితుల్లో పోవలసి వచ్చినా అక్కడ ముండ్ల మీద నిలబడినట్టు నిలబడుకోని ఉండి వచ్చేసేవాడు. రెడ్లు అన్ని కులాలోళ్లను మ్మేయ్... రేయ్ అని పిలిచేవాళ్లు. అందరి మాదిరిగా తనను ఎవరైనా రేయ్ అని పిలిస్తే రమణ భరించలేకపోయేవాడు. ఏదో తనకే తెలీని దుఃఖము, బాధ మనసును మెలిపెట్టేటియి.. తనలోకి తనే ముడుచుకుపోయేవాడు... గలాగలా అందరితో మాట్లాడే రమణ గంభీరంగా ఉండటం అలవాటు చేసుకున్నాడు.

చదువుల కోసం రమణ పట్టణం చేరుకున్నాడు. పట్టణంలోని రణగొణ ధ్వనులు, యంత్రాల్లా మనుషుల పరుగులు ఒకింత ఇబ్బంది కలిగించినా కులాలకు, మతాలకు ప్రాధాన్యం ఇవ్వని విషయం సంతోషపరిచింది. అయినా పట్టణంలో కూడా పేద, ధనిక అనే రెండు వర్గాలు ఉండటం కొద్దిరోజుల్లోనే గమనించాడు. అక్కడ కూడా ధనికులు అనిపిస్తే... అలాంటి వారి దగ్గర ముడుచుకుపోయేవాడు. ఆత్మన్యూనతకు లోనయ్యేవాడు. అందుకే పల్లెల్లోనే కాదు, పట్టణంలోనూ చెప్పుకోదగ్గ మిత్రులు రమణకు లేరు. అయినా రమణకు ఆ పల్లెకన్నా పట్టణమే మేలనిపించేది.

ఏండ్లు జరిగిపోయాయి. రమణ కొన్ని రోజులు కులవృత్తిని పట్టుకుని ఊగులాడినాడు. ఆ వృత్తి తనకు, భార్యాబిడ్డకు పొట్ట నింపలేదు. తనకన్నా తెలివి తక్కువగా ఉన్నవాళ్లు ఎంతో దర్జాగా బతుకుతా ఉంటే చూడ్డం తప్ప తనుకూడా వాళ్లలా చేయలేకపోయేవాడు. అధికారి దగ్గరకో, నాయకుని దగ్గరకో, ధనస్వామి దగ్గరకో పోయి నమస్కారం పెట్టడానికి చాలా ఇబ్బంది పడేవాడు. చేయలేకపోయినా చేసేస్తామని, తప్పయినా ఒప్పని మాటలు చెప్పి ఎదుటి మనిషిని మెప్పించలేకపోయేవాడు.

చదువుకోని తన తండ్రి జీవితానికి, చదువుకున్న తన జీవితానికి పెద్ద తేడా లేదనిపించింది. సంపాదనంతా అత్యవసరాలకే చాలని స్థితి.

అలాంటి స్థితిలో రమణకు చిన్న ఉద్యోగం వచ్చింది.

పోదాం పా... అని నరేష్ పైకి లేచే వరకూ రమణను గతం వెంటాడతానే ఉంది. సభ అయిపోయింది. ఇద్దరూ బస్టాపు కాడికి వచ్చినారు.

బస్సులో జరిగిన సంఘటనతో పల్లెలో రెడ్లకు ఇక్కడ ఇతనికి తేడా లేదనిపించింది రమణకు. అలా అనుకోగానే రమణ మనసు మరింత బాధకు గురయింది.

సభ గురించి, పుస్తకం గురించి, రచయిత గురించి నరేష్ మాట్లాడతానే ఉండాడు. రమణ మాత్రం మౌనంగా ఉండాడు.

ఏం మౌనంగా ఉండావే... అడిగినాడు రమణను నరేష్

నీ విషయమే ఆలోచిస్తా ఉండాను. నీ కెందుకంత చిరాకు? నిన్ను నేనేమీ తాకడం లేదే... నువ్వే నా చేతికి డబ్బు ఇస్తా ఉండావు. తాకితే నీ వేలు నా అరచేతిని తాకుతుందంతే. దానికే తాకకూడని దాన్ని తాకబోతున్నంత చిరాకెందుకు...? నేనేమీ నిన్ను రాసుకోని పూసుకోని తిరిగడం లేదే... అన్నాడు రమణ.

పోనీలే వదిలేయ్... అదేమంత పెద్ద విషయం కాదులే. నువ్వే కాదు... నా దగ్గర బంధువులయినా అంతే... నేను చిన్నప్పటినుంచి బ్రాహ్మణోల్ల ఇళ్లలో పెరిగాను కదా... కాస్త చాదస్తం... అన్నాడు తన చర్యను సమర్థించుకుంటున్నట్లుగా నరేష్ ఆ సమాధానం రమణను మరింత బాధించింది. శుభ్రతను యిష్టపడటం, ఎవరైనా తనను తాకితే చిరాకు అన్పించడం తన స్వాభావిక లక్షణం అని నరేష్ చెప్పింటే రమణ పెద్దగా బాధపడిండడేమో... తన మనసులో బాధ దుఃఖంగా మారేటిగా ఉంది. నిగ్రహించుకుంటా ఉండాడు.

ఔన్లే... నీకు ఇది చిన్న విషయమే... బాధితుడు నువ్వు కాదుకదా... అన్నాడు రమణ.

అరే... ఇందులో సీరియస్ విషయం ఏముంది.... అన్నాడు చాలా తేలిగ్గా నరేష్.

రమణ మనసును చెరకు క్రషర్‌లో పెట్టినట్లు ఉంది. ఇక ఏం మాట్లాడలేకపోయినాడు. కళ్లనుంచి ఉబికి వచ్చే నీళ్లను అతి బలవంతంగా ఆపుకున్నాడు.

ఆ సంఘటన జరిగి ఇప్పటికి ఆరునెలలు దాటుతోంది. ఇంకా అది పచ్చి పుండులా రమణ మనసును బాధిస్తూనే ఉంది. గుండెను మెలిపెడుతోంది. ఆ సంఘటనను తలచుకుంటే కండ్లనుంచి నీళ్లు కారిపోతా ఉండాయి. అప్పటినుంచి జాగ్రత్తగా గమనించడం మొదలు పెట్టినాడు. పదేళ్లకు ముందుతో పోలిస్తే పట్టణంలో ఇప్పుడు కులం గొడవలు ఎక్కువయిన సంగతి అర్థమయింది.

కులాలు, మతాలు, డబ్బు పట్టింపు లేకుండా... మనిషిని మనిషిగా గౌరవించే రోజులు వస్తాయా...? అలాంటి రోజులకోసం రమణ ఎదురు చూస్తున్నాడు.

అరుణతార, జనవరి 2006